# రచయితల మీదా జోకులుంటాయి!

అన్నిట్లో ముందుండాలనుకుంటారు కాబట్టి ముందస్తుగా యండమూరి వీరేంద్రనాథ్ పేరు వాడదాం.

ఆంధ్రాబేంక్‌లో పనిచేస్తుండగా ఓసారి వీరేంద్రనాథ్ బేంక్ పని మీద ఫస్ట్‌క్లాస్ కూపేలో వైజాగ్ వెళ్తున్నారు.

రైల్వే రిజర్వేషన్ ఛార్ట్‌లో 'మిస్ కోమల' అన్న పేరు చూసి ఆ అమ్మాయి కోసం ఎదురు చూడసాగారు. రైలు బయలు దేరడానికి రెండు నిమిషాల ముందు మిస్ కోమల వచ్చి కూర్చుంది.

పేరుకి తగ్గట్టుగానే, ఎంతో కోమలంగా, అందంగా ఉందామె. రైలు కదలగానే ఆమె తన హేండ్ బాగ్ తెరచి అందులోంచి రెండు పుస్తకాలు తీసింది. అవి వెన్నెల్లో ఆడపిల్ల, తులసీదళం. అందులోంచి తులసీదళం పుస్తకం తెరిచింది. వీరేంద్రనాథ్ నెమ్మదిగా "ఆ పుస్తకం నేనే రాశాను. నా ఆటోగ్రాఫ్ కావాలా?" అని అడిగారు.

ఆ అమ్మాయి వీరేంద్రనాథ్ వంక చూసి మళ్ళీ తన చేతిలోని పుస్తకాల వైపు చూసి అడిగింది అమాయకంగా.

"వీటిలో ఏవి?" అని.

(ఆ రెండూ వీరేంద్రనాథ్ రాసినవే)

***

సహజంగా ఏ రచయితకయినా తను రాసిన నవల సినిమాగా వచ్చినప్పుడు గర్వంగా వుంటుంది.

సూర్యదేవర రామ్మోహనరావు రాసిన 'డియర్' నవల తొలిసారిగా సినిమాగా వచ్చినప్పుడు ఆయన విజయవాడలో వున్నారు.

ఆ థియేటర్‌కి మొదటిరోజు మార్నింగ్ షోకి వెళ్ళి మొదటి టిక్కెట్ కొన్నారు. కౌంటర్‌లోని వ్యక్తి చేతిలో టికెట్ డబ్బులు పెడుతూ యిలా అన్నారు సూర్యదేవర.

"దయచేసి ప్రముఖ రచయిత సూర్యదేవర రామ్మోహనరావు

డైరెక్ట్ నవల 'డియర్' ఆధారంగా నిర్మించిన 'చాదస్తపు మొగుడు' సినిమాకి ఓ టిక్కెట్టు యిస్తారా?"

***

యర్రంశెట్టి సాయికి రిపార్టీ అద్భుతం. ఓ ఛోటా నవలా రచయిత ఇటీవల తన నవలని తీసుకెళ్ళి "అయ్యా. ఇదో చక్కటి కామెడీ నవల. దయచేసి దీన్ని చదివి మీరు ముందుమాట రాస్తారా?" అని అడిగాడు.

యర్రంశెట్టి సాయి చిన్నగా నవ్వి "అయ్యా. ఇంతదాకా నూట తొంభై రెండు కామెడి నవలలకి ముందుమాట రాసాను" అని యిలా రాసిచ్చారు.

'బావున్నదంతా ఒరిజనల్ కాదు. ఒరిజనల్ అంతా బావున్నది కాదు. ఇది ఏ కోవకు చెందినదో నవలల్లో చదివి తెలుసుకోండి'

'ఇలా రాసారేంటి సార్?' అని ఆ కుర్ర రచయిత అడిగితే ఏమన్నారో నే చెప్పక్కర్లేదు. ఆయన రచనలు చదివే మీ కందరికీ తెలుసు. అయినా చెప్తాను. 'నూట తొంభై రెండు కామెడి నవలలకి ముందు మాట యిలాగే రాసాను' అని జవాబిచ్చారు.

***

కొమ్మూరి వేణుగోపాలరావుగారు ఓసారి లయన్స్ క్లబ్ మీటింగ్‌కి వారి ఆహ్వానం మీద వెళ్ళి నవల రాయడంలో ఈ రచయిత ఎదుర్కొనే యిబ్బందుల గురించి ఉపన్యసించారు. వెంటనే ఒకతను లేచి నిలబడి 'రచన చేయడం అంత కష్టం కాదు. మీరూర్కే ఎక్కువచేసి చెప్తున్నారు' అన్నాడు.

కొమ్మూరి వేణుగోపాలరావుగారు కొన్ని క్షణాలు మౌనంగా ఉండి చెప్పారు. "రచన చేయడం సైకిల్ తొక్కడం లాంటిది. చూడడానికి ఎంతో తేలిక అనిపిస్తుంది. మొదలు పెట్టాక తెలుస్తుంది ఎంత కష్టమో."

***

ఒకోసారి విమర్శకులు రచయితలకన్నా తెలివిగా మాట్లాడు

తుంటారు. కొమ్మనాపల్లి గణపతిరావు నవలని ఓ దినపత్రికలో ఓ విమర్శక శిఖామణి బాగా లేదని రాసాడు. వాళ్ళిద్దరు ఓ సినిమా ప్రివ్యూలో కలుసుకున్నప్పుడు అడిగారు కొమ్మనాపల్లి "ఏం మాస్టారు? ఒక్క నవలయినా రాయని మీరు నా నవలని అంతలా విమర్శిస్తారా?" అని. అందుకా విమర్శకుడు నవ్వేసి "నాకు కోడిపెట్టలా గుడ్డు పెట్టడం తెలీక పోవచ్చు. కాని ఆమ్లెట్ వేయడం కోడిపెట్టకంటే బాగా తెలుసు" అని జవాబిచ్చాడు.

***

శాతవాహన రాసిన ఓ నవలని పబ్లిష్ చేయడానికి యివ్వమని చాలా కాలంగా అడుగుతున్నాడో పబ్లిషర్. చివరకి ఓ నవల యిచ్చారు శాతవాహన. ఆ పబ్లిషర్ ఎంతో సంతోషపడిపోయి 'నవలని నాకిస్తున్నందుకు మీకెలా కృతజ్ఞతలు చెప్పాలో నాకు తెలీడం లేదు' అన్నాడు. అందుకు శాతవాహన నవ్వి 'ఇలా మీలా తెలీని వాళ్ళకోసమే మన ప్రభుత్వం 'డబ్బు' అనే పదార్థాన్ని చలామణి చేస్తోంది' అన్నారు.

***

పేరొద్దుకాని ఓ ఎడిటర్‌కి చందు సోంబాబు ఓ కథని డబ్బై మూడులో పంపించాడు. అది 'బాగాలేదు' అన్న కామెంట్‌తో వెనక్కి తిరిగి వచ్చింది. దీన్ని మళ్ళీ ఎనభై మూడులో అదే ఎడిటర్‌కి తిరిగి రాసి పంపారు. ఆ ఎడిటర్ నించి ఆ కథ తిరిగి రావడమేకాక 'మేం రిటర్న్ చేసిన కథని మళ్ళీ పంపిస్తే గుర్తుపట్టలేమనుకున్నావా?' అని వుత్తరం రాసారు.

చందు సోంబాబు దానికి జవాబు రాస్తూ 'అది కాదు ఆర్యా! ఈ పదేళ్ళలో ఎడిటర్‌గా మీరు కొద్దిగానైనా ఎదిగి వుంటారన్న నమ్మకంతో దాన్ని మీకు తిరిగి పంపించడం జరిగింది తప్ప మరే ఇతర వుద్దేశ్యంతో కాదు" అని జవాబిచ్చారు.

***

చల్లా సుబ్రహ్మణ్యం రాసి పంపే ప్రతి పేజీ మీద ఈ వాక్యం అచ్చువేసి వుంటుంది.

'NO MAN, EXCEPT A BLOCK HEAD, EVER WROTE FOR MONEY'

***

రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి చేతి వ్రాత కొందరికి పుస్తుభాషలా తప్ప ఛస్తే తెలుగు లిపిలా కనపడదు. దాని మీద ఓ పాత్రికేయుడు వేసిన జోక్....

"ఆయన మొదటి కథ చందమామలో వచ్చింది. ఆ చేతి వ్రాతని కరెక్ట్‌గా అర్థం చేసుకుని వుంటే కొడవటిగంటి కుటుంబరావుగారు తిప్పి పంపేవారు కాని అందులో ఏదో విషయం వుందని, ఆయన పేరుని బట్టి భ్రమపడి, దాన్ని దిద్ది మంచి కథ చేసాననుకుని, ఓ కొత్త కథని తయారు చేసి ప్రచురించారు."

***

ఎలాగయినా తను రచయితననిపించుకోవాలని ఓ ఛోటా రచయిత అనేక కథలు రాసి వివిధ పత్రికలకి పంపడం, అవన్నీ తిప్పి పంపబడటం జరుగుతూండేది. అయిదేళ్ళ తర్వాత 'ఉదయం' వీక్లీ అతని ఓ కథని అంగీకరిస్తూ ఉత్తరం రాసింది. అది అందుకున్న అతను సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఇంతకాలం తను కథ విషయంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, తన పట్టుదల మొదలయిన వివరాలు తెలుపుతూ, కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ పది పేజీల ఉత్తరం రాసి పంపాడు.

ఆ ఎడిటర్ నించి కొద్దిరోజుల తర్వాత 'స్టోరి రిజెక్టెడ్' అన్న రిమార్క్‌తో ఆ పది పేజీల లెటర్ తిరిగి అతనికి పంపబడింది.

***

"సాహిత్యంలో గొప్ప అద్భుతం ఏమిటి?" అని ఓసారి ఎవరో శ్రీమతి యద్దనపూడి సులోచనారాణిని అడిగితే ఆవిడ ఇచ్చిన సమాధానం ఇది.

"చదివిస్తానని పట్టుకెళ్ళిన పుస్తకాన్ని నిజంగా తిరిగి తెచ్చి ఇవ్వటం."

***

ఓ వర్ధమాన రచయిత్రిని అడిగారు ఎడిటర్ పురాణంగారు.

"ఈ మధ్య మీరు బొత్తిగా కథలు రాయడం మానేసారే?"

"ఇదివరకు మా ఆయన ఇంటికి ఆలస్యంగా వచ్చి ఏదో ఓ కొత్త కథ చెప్తూండేవారు. నేను అవి రాసేదాన్ని. ఆయన రెండేళ్ళ క్రితం పోయారు. ఇంకేం రాయను?"

***

మిల్టన్ తన భార్య బ్రతికుండగా 'పేరడైజ్ లాస్ట్' ఆవిడ మరణించాక 'పేరడైజ్ రీగైన్డ్' రాసారు. ఇది మిల్టన్ మీద జోకా? లేక అతని భార్య మీదా?

(ఉదయం వీక్లీ నుంచి)

# కావలెను

ఆ మధ్య ఓ ప్రఖ్యాత ఫిలిం కంపెనీకి మాటలు రాశాను. ప్రేమకథే అయినా, అది సరికొత్తతరహా ప్రేమకథ. స్క్రిప్ట్ పూర్తికాక మునుపు ఫలానా నటీనటులనుకున్నా, మొత్తం స్క్రిప్ట్ పూర్తయ్యాక అంతా చదువుకుంటే, ప్రేక్షకులకి ఎలాంటి అభిప్రాయంలేని కొత్త నటీనటులవుతేనే బావుంటుందన్నారు దర్శకులు. తెలుగులోని ప్రతి నటీనటులకి ప్రేక్షకులతో ఓ ముద్ర వుండటంతో కొత్త నటీనటులయితే బావుంటుందనే నిర్ణయం తీసుకున్నారు. నిర్మాత అంగీకరించడంతో ఓ తెలుగు, ఓ ఇంగ్లీషు దినపత్రికలలో కొత్త నటీనటులు కావాలని ప్రకటన ఇచ్చారు.

దాదాపు పాతికేళ్ళ అనేక మంచి తెలుగుచిత్రాలు అందించిన సంస్థ అవడంవల్ల, పేరున్న మంచి దర్శకుడు ఆ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తూండటంవల్ల, ముఖ్యంగా కేవలం ఫొటోలు, చిరునామా తప్ప